


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నాయకత్వం

**మా** రాణీ **టీచర్** చాలా తెలివైనదనే చెప్పాలి. మిగతా క్లాసుల్లో, క్లాస్ ఫస్ట్ వచ్చేవాళ్ళని చూసి మానిటర్ చేస్తారు. మా క్లాస్‌లో రాణీ టీచర్ 'సందానీ' అల్లరి చూసి మానిటర్ చేసేసింది. దాంతో వాడు 'మేన్ ఈటర్'లా రెచ్చిపోయాడు. అన్నింటికి పేర్లు రాయడమే. పనిష్మెంట్స్ ఇవ్వడమే.

"ఏ.వీ రమణి ఒక్క జడవేసుకుంది.. నీల్ డౌన్ చెయ్యి"

"మల్లేష్‌గాడు ఒకటే కమ్మర్ కట్టీ తెచ్చుకుని ఒక్కడే తినేసాడు... నీల్ డౌన్ చెయ్యి."

"ఆ అను. నువ్వా స్కూల్లో నేరేడు పండ్లు చెట్టుకింద ఏరుకుని తినొచ్చినయ్ మానిటర్‌కి తేవాలని తెలీదా. నీల్ డౌన్ చెయ్యి."

"ఒసే టీ.వి హేమమాలినీ కంపాస్ బాక్స్‌లో బఠానీలు తెచ్చుకుని తింటున్నాయ్? పటపట చప్పుడొస్తున్నయ్. నీల్ డౌన్ చెయ్యి"

"ఒరే నీ యూనిఫార్మ్‌లోంచి మీ నాన్న చారల నిక్కర్ వేసుకొచ్చినయా? నీల్ డౌన్ చెయ్యి"

"రజియా సుల్తానా చెవులకెల్లి గులాబీ పూలు మొలుస్తున్నాయ్? లోపల మట్టి వున్నాయా? నీల్ డౌన్ చెయ్యి"

"ఏయ్ ఎప్సీబా నాకీ ఎక్జాంలా చూపించమంటే, దాసుకుంటయ్? రా.. నీల్ డౌన్ చెయ్యి"

కొన్నాళ్ళకి అందరం కాళ్ళతో కాకుండా మోకాళ్ళతోటే నడవడం అలవాటయిపోయి మామూలుగా నడవలేకపోయాం. ఇలా వీడు అధికారం చేతికి రాగానే రెచ్చిపోయి, వీరవిహారం చెయ్యడం మొదలు పెట్టాడు. దాంతో వీడికి 'డేరా' బాబాలకి మన జనం సమర్పించుకున్నట్టు, తేగలూ, కర్బూజా గింజలూ, సీమ చింతకాయలూ, చివరకి అమ్మమ్మ జాడీలోంచి ఊరగాయ ముక్కలతో సహా సమర్పించుకోవడం మొదలు పెట్టాం. దాంతో వీడు శాంతించలేదు. తల్లో పేలు చూడమని వెంకట లక్ష్మికీ, నోట్సులు రాసి పెట్టమని నాకూ, పేపర్ పడవలు చేసి పెట్టమని భూపతి రాజాగాడికీ, కాలు గోకమని వి.ఏ.శామ్యూల్ గాడికీ పనులు చెప్పడం మొదలు పెట్టాడు.

ఇవన్నీ కూడా బ్లాక్ బోర్డ్ మీద మా పేర్లు రాయకుండా వుండేందుకు మేం కాకాపట్టడం అనమాట. సరే ఇంక ఈ పేర్లు వాడు రాసాక రాణీ టీచర్ చూస్తే ఆ ప్రహసనం ఇంకోలా వుండేది. "రేపు ఆదివారం బేబీ, వినీలియా, ఏ.వీ రమణీ, ధనలక్ష్మి ఇంటికి రండే" అనేది.

మేం ఆదివారం లేచి తలస్నానాలు చేసి, డిసెంబరాలో, కనకాంబరాలో తలనిండా పెట్టుకుని పిక్‌నిక్ వెళ్ళినట్లు వెళ్ళేవాళ్ళమా? "ఈ అల్లం, ఎల్లిగడ్డ పొట్టు తీసి పెట్టండే" అనేది. లేదా పెరట్లో తోటకూర విత్తనాలు జల్లమని, మొక్కలకి పాదులు చేయించేది. రోజంతా ఆ అరవ చాకిరీ చేయలేక చేజారిపోయిన ఆదివారం తలచుకుని కుమిలిపోతూ 'సందానీ సచ్చినోడు' అని నోరారా తిట్టుకునేవాళ్ళం.

అధికారం అనేది అలా తేలులా అంటబొడిచి, ఇవన్నీ చేయిస్తుందేమో అని ఈ మధ్య అనిపిస్తోంది. మన ప్రజాప్రతినిధులూ, రాజకీయ నాయకులని చూడండి. అధికారం రాకముందు ఎక్కడో గంగిగోవులా చేతులుకట్టుకుని బండెడు ఫైల్సు రాసేవాడూ, పోస్టర్లు జిగురుతో అతికించేవాడు కూడా అధికారం చేతికి రాగానే సింహాల్లా జూలు విదిలించి "మా బావమరిదికి ఎమ్.ఎల్.ఏ టికెట్టూ, బావమరిది కొడుక్కి మెడికల్ కాలేజీ సీటూ, మేనకోడలి కొడుక్కి ఎల్.కేజీ సీటూ" అని రెచ్చిపోతారు.

పెత్తనం చేయడం, మనకన్నా కిందవాళ్ళ చేత పనులు చేయించుకోవడం కూడా ఒక కళే. సందానీగాడిలాగా లీడర్ షిప్ క్వాలిటీస్ లేకుండా వుంటే ఎంత అవస్తగా వుంటుందంటే ఏదైనా ఒక ప్రోగ్రాం మొదలు పెడితే ప్రతివాడూ వచ్చి ఇలా చేస్తే బావుంటుంది, అలా చేస్తే బావుంటుంది అని సూచనలు ఇస్తారు. మనమూ సూచనలన్నీ పాటిస్తూ వుంటే మళ్ళీ వేరేవాడు వచ్చి అది కాదు ఇది చెయ్యి అంటాడు. మళ్ళీ వీడిని ఫాలో అవుతూ వుంటాం. ఈ లోపల ప్రెసిడెంటు దగ్గరనుంచి కబురొస్తుంది. ఆ రెండూ కాదు నేను చెప్పినవి చెయ్యండి అంటాడు. ఈ రకంగా నాయకత్వ లక్షణాలు లేనివాళ్ళందరు చెప్పిన పనులూ చేస్తూ మనం పనుల్లో కూరుకుపోతాం. పోనీ పనులు ఎవరికైనా అప్పజెపుదామా అని అనుకుంటామా ఒక కమిటీ వేశాం అంటే ఆ కమిటీలో వున్న నలుగురికీ నాలుగు మాటలు. ఏ ఒక్కరూ ఏ ఒక్కరితోటీ ఏకీభవించరు. ఈ రకమైన పాట్లు ఎన్నో వుంటాయి.

ఈ ప్రోగ్రామ్స్ వచ్చినప్పుడు కొంతమంది స్టేజ్ కమిటీనే చేస్తామంటారు. ఎందుకంటే మైక్ దగ్గరగా వుంటుందని. లేదురా మీరు టెక్నికల్ అసిస్టెంట్స్ అంటే కూడా వాళ్ళు నిమిషానికోసారి మైక్ టెస్ట్ చేస్తామంటూ స్టేజ్ ఎక్కేస్తుంటాడు. ఇంకొకతనొచ్చి 'స్టేజ్ మీద నాకు కమాండు వుంటుంది నేనుంటే ఎవ్వరినీ పైకి రానివ్వను నాకివ్వండి' అంటాడు. నిజమే రేపొద్దున చిరంజీవి వచ్చినా ఇతనుంటే స్టేజ్ ఎక్కనివ్వడు, మైక్ ఇవ్వడు.

ఇంక చాలామంది ఆషామాషీ పనులనుకుంటారు. అతిథులను తీసుకురావటం, వాళ్ళకి అకామిడేషన్ చూపించడం, వాళ్ళకేం కావాలో అడగటం ఇవన్నీ. 'అలాంటి నౌకరు పనులు మేం చెయ్యం' అంటారు. కానీ అవి ఫంక్షన్‌కి చాలా ఇంపార్టెంట్ పనులు. కొంతమంది ప్రార్ధనా గీతాలు పాడతారు. మనం విని భరించలేం. 'వద్దమ్మా చిత్రతో పాడిస్తాం' అంటే వీళ్ళ మొహం మాడిపోతుంది. 'మమ్మల్ని తొక్కేస్తున్నారు. మా టాలెంట్ బయటకి రానివ్వటంలేదు' అంటారు.

ఎవరినైనా సరే మీరు రాసిన స్కిట్ బాలేదనో, మీరు వేసిన వేషం బాలేదనో, మీరు రాసిన పాట బాలేదనో, మీరు పాడలేరనో మీరు ఆడలేరనో అంటే 'మా మీద కుళ్ళు. ఇండస్ట్రీ ఇలానే తొక్కేస్తోంది మమ్మల్ని' అని అనడం మొదలు పెడతారు. ప్రోగ్రాం వస్తుందంటే వందలకొద్దీ అప్లికేషన్లు వస్తాయి. ఎందుకంటే ప్రతివాళ్ళూ పుంభావ సరస్వతులే. ఇంక కొంతమందైతే 'మీరుండాలి' అనగానే 'అబ్బబ్బే అమెరికాలో ట్రంప్ గారు రమ్మని చెవిలో జోరీగలాగా గొడవ పెడ్తున్నారు, మీరు ఫస్ట్‌క్లాస్ టిక్కెట్టు ఇస్తే హైదరాబాదు రావడానికి ప్రయత్నిస్తాం' అంటారు. 'వద్దులెండి ట్రంప్ గారికి ఏం కష్టమొచ్చిందో ఏమిటో పాపం అది చూసుకోండి ముందు ఆ తరవాతే మన విషయం ఆలోచిద్దాం. అసలే ఆ దేశాన్ని నమ్ముకుని ఇంటికి ఒకడ్నో, ఇద్దర్నో కన్నాం కదా' అనాలి మనం.

కొంతమంది మా ఆవిడ రాకుండా మేము రామని, మా పనిమనిషి లేకుండా రామని అనేవాళ్ళు కూడా ఉన్నారు. ఇంతలేసి ధైర్యాలెలా వస్తాయో నేను పుట్టింట్లో కూడా అనలేదు. మా ఆయన లేకుండా నేను రానని. సరే ఇంక పనులు చెప్తామా! వాడికంటా నేను సీనియర్ని, వీడు నాకంటా జూనియరు వాడితో నేను వెళ్ళడమా! లేకపోతే వాడు నాకు చెప్పడమా ఇలాంటివన్నీ వస్తూవుంటాయి.

ఇక డబ్బులు దగ్గరకు వచ్చేటప్పటికి 'అయ్యో ఆ బకాసురుడిని రానీయకండి తినేస్తాడ'ని ఒకడు, 'ఆ కుంభకర్ణుడికి పని చెప్పారా వాడసలే ఏ పనీ చెయ్యడు' అని ఇంకొకళ్ళు ఇలా ఒకళ్ళమీద ఒకళ్ళు చెప్పుకోవడం 'నేను అపాచీల మీద ఫలానా మెక్సికన్ యూనివర్శిటీకి పేపర్లు రాసా. ఎం.ఫిల్ ఇద్దామా ఏకంగా డి.లిట్ ఇద్దామా అని వాళ్ళు ఆలోచిస్తున్నారు' అని ఒకళ్ళు, 'నేను అగ్గిపుల్లల మీద కవిత్వం రాసాను, గిన్నీస్ బుక్‌లో ఎక్కాను' అని ఒకరు, 'అగ్గిపుల్లల మీద కాబట్టి ఇతని అక్షర దోషాలు ఎవరూ ఎంచలేద'ని వెంటనే సెటైర్ వేసేవాడింకొకడు. ఇలా రకరకాలుగా జరుగుతుంటాయి సాధారణంగా కమిటీలన్నింటిలోనూ.

ఇదిలా వుండగా, మా మరుధూరి రాజా అన్నయ్య ఓ ఫేస్‌బుక్ ఫోస్ట్‌తో నన్ను ఇన్‌స్పైర్ చేసాడు. రాజా దగ్గర అతను మంచి బిజీగా వున్న టైంలో ఓ అబ్బాయొచ్చి అసిస్టెంట్‌గా చేర్చుకోమని కాళ్ళావేళ్ళా పడ్డాడుట. తనూ "సరే" అన్నాడట. అతను మరునాడు ఓ ప్రముఖ సినీ రచయిత దగ్గర అసిస్టెంట్‌గా జాయిన్ అయ్యాను అని తెగ ఫీల్ అయిపోతూ వచ్చాడుట. రాజా ఒక పెద్ద సంచి చేతికిచ్చి బయలుదేరి "పద" అన్నాడుట. అతనికి అర్థం కాలేదు కానీ ఫాలో అయ్యాడుట. తిన్నగా కూరల మార్కెట్‌కి తీసుకెళ్ళి బెండకాయలు తను గిల్లుతూ, అతని చేతకూడా గిల్లిస్తూ, సొరకాయ, లేత వంకాయలూ, దొండకాయలూ, టమాటాలూ, అన్నీ సంచి నిండా కొని తీసుకొచ్చి, కబుర్లు చెప్తూ అతని చేత ఉల్లిపాయ పొట్టు వలిపిస్తూ, వంకాయ రోటి పచ్చడీ, బెండకాయ వేపుడూ, ముక్కల పులుసూ వండి, భార్యని పిలిపించి, ముగ్గురూ తిన్నారట. మర్నాడు షరా మామూలే. కానీ కూరలు వేరు.

ఇలా నాలుగు రోజులు గడిచేసరికి అసిస్టెంట్ మొహంలో కళ తప్పి, బుగ్గలు నున్నబడి 'అసలు నేను వచ్చింది మరధూరి రాజా అనే రైటర్ దగ్గరకా, లేక ఏదైనా హోటల్‌లో వంటవాడి దగ్గరకా? ' అన్న మీమాంస మొదలైందిట.

కానీ ఇతని అందు గురుభక్తి పెరిగి, ఇతని పెళ్ళానికి సొంత తమ్ముడిలా బాంధవ్యం పెరిగి, ప్రేమలు పెంచుకుంటుండగా, ఒకరోజు ఎవరో వచ్చి "రాజాగారూ, మీ అసిస్టెంట్ పూర్ణా మెస్ దగ్గర ఎవడితోనో కొట్లాడి దెబ్బలు తింటున్నాడని" చెప్పాడుట.

వెళ్ళి చూస్తే చావు తప్పి కన్నులొట్టపోయి అసిస్టెంట్ కనిపించాడుట. ఇంటికి తీసుకొచ్చి, మంచినీళ్ళిచ్చి "ఏవిట్రా మేటర్?" అంటే "వాడెవడో మిమ్మల్ని పచ్చి తాగుబోతు అన్నాడు గురువుగారూ. తట్టుకోలేకపోయాను" అన్నాడుట. అతని ముందు రాజా ఎప్పుడు మందుకాదు కదా బిస్లరీ బాటిల్ ఎత్తి మంచినీళ్ళు కూడా తాగలేదుట.

రాజా పెద్దగా నవ్వి "ఒరే! నీ దురదృష్టం కొద్దీ నేను రచనలు బోర్ కొట్టి వారం రోజులు రెస్ట్‌లో వున్నప్పుడు, తాగుడు మానేసి నెలరోజులు నిష్ఠగా వున్నప్పుడూ వచ్చి నా దగ్గర జాయిన్ అయ్యావు. కృష్ణావతారంలో విశ్వరూపం తర్వాత సీన్‌లో థియేటర్‌లోకి వచ్చి కృష్ణుడు మినియేచర్‌లా వున్నాడు అంటే ఎలా?" అని కళ్ళు తెరిపించాడుట.


ఇదీ ఓ స్కిట్‌గా వేయిద్దాం రాజా చేతే అని నేను నోట్ చేసుకున్నాను.


ఇదంతా నేను సరదాగా రాసాను కానీ నిజంగా నవంబర్ 3న జరిగే నేను కల్చరల్ ఛైర్ పర్సన్‌గా వున్న మా తెలుగు సినిమా రచయితల సంఘం తాలూకు 25 ఏళ్ళు పూర్తయిన రజతోత్సవం సంబరాల్లో మంచి స్కిట్స్, మా మంచి రైటర్స్‌కీ, పెద్దలకీ జీవితసాఫల్యాలూ, తెలుగు భోజనాలూ, మెడల్‌లూ, పలకరింతలూ, పులకరింతలూ అన్నీ వుంటాయి. ముఖ్యంగా పెద్దలు గొల్లపూడిగారు, సింగీతం శ్రీనివాసరావుగారు, రావికొండలరావుగారూ, ఆదివిష్ణుగారు, భువనచంద్రగారూ, కోదండరామిరెడ్డిగారు, పి.ఎన్.రెడ్డిగారు, ఎమ్.బాలయ్యగార్లకి లైఫ్ టైం ఎఛీవ్‌మెంట్స్, ఇంకా చాలామందికి ప్రతిభా పురస్కారాలూ, విశిష్ట సేవా పురస్కారాలూ వుంటాయి.

"రచయిత లేనిదే ఏ సినిమా లేదు" ఇది మా కుటుంబం అంతా ఒక్కచోట చేరి నొక్కి చెప్తాం. మా సినీ తెలుగు రచయితల సంఘం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న రజతోత్సవ వేడుకల సందర్భంగా క్రింద లింక్‌లో టీజర్ సాంగ్ చూడండి.

https://www.youtube.com/watch?v=hHlQ6-VoAw4&feature=youtu.be&fbclid=IwAR3SXBCAtH8F7iFo8Kd7-3UFDwRAg4_lpmh2sMOu6HXDildjUzFKMNO5LzI

Post your comments




https://www.youtube.com/watch?v=ERaaX_IulS4